అసెంబ్లీ సెగ్మెంట్లే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు

- పార్లమెంటు కేంద్రాల్లోనే లెక్కింపు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న జిల్లా ఎన్నికల సంఘం

కలెక్టరేట్, ఏప్రిల్ 16: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీ సెగ్మెంట్లలోనే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్‌కు ముందురోజు అందజేసే ఎన్నికల సామగ్రి నియోజకవర్గ కేంద్రాల నుంచే పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పోలింగ్‌లో కీలకమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర సామగ్రిని లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన మేరకు సెగ్మెంట్లకు తరలించారు. ఆయా చోట్ల ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముల్లో వాటిని భద్రపరిచారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి కూడా ఇప్పటికే మొదటి విడుతగా శిక్షణ కూడా పూర్తి చేశారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా సిబ్బంది పోలింగ్ విధులు నిర్వహించేలా ఉద్బోధిస్తూ, అవగాహన కల్పించారు. అలాగే, ఓట్ల లెక్కింపు కూడా పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల్లోనే చేపట్టనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు కూడా చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో జిల్లా కేంద్రాల్లో మాత్రమే పార్లమెంటు ఓట్ల లెక్కింపు జరిగేది. అయితే, ఈసారి ఎన్నికల సంఘం చేసిన మార్పులకనుగుణంగా పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల్లో మాత్రమే లెక్కించనున్నారు. మే 13న పోలింగ్ ముగియనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. అంతవరకు లెక్కింపు కేంద్రాల్లోనే ఈవీఎంలను భద్రపరచాల్సి ఉన్న దృష్ట్యా స్ట్రాంగ్ రూములు పరిశీలిస్తూ, అవసరమైన మరమ్మతులు, మార్పులు చేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంటు సెగ్మెంట్‌కు సంబంధించి నగరంలోని ఎస్సారార్ కళాశాలలో లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయనుండగా, ఇక్కడ పోలింగ్ అనంతరం వచ్చే ఈవీఎంలను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల సెగ్మెంట్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించిన ఈవీఎంలను కూడా ఎస్సారార్ కళాశాలకే తరలించనున్నారు. పోలింగ్ అనంతరం లెక్కింపునకు 21 రోజుల వ్యవధి ఉండడంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పార్లమెంటు నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి కే మహేశ్వర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదు

- కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నయాపైసా పనైనా చేశాడా?
- పార్లమెంటులో ప్రశ్నించే గొంతుక వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- చొప్పదండిలో బూత్ స్థాయి నాయకుల సమావేశం

చొప్పదండిలో ఏర్పాటు చేసిన మండల బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, ఏప్రిల్ 16: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చని ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ఓటు అడిగే హక్కు లేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. అలాగే కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నయా పైసా పనైనా చేశాడా? అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మంగళవారం చొప్పదండి పట్టణంలో మండలంలోని బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారెంటీలతో మోసపోయి గోసపడుతున్నామని, మళ్లీ మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని, కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఆయా పథకాలతో లబ్ధి పొందిన వారి దగ్గరికి వెళ్లి ఓటు అడిగే హక్కు తమకే ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణ హరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, కౌన్సిలర్లు కొత్తూరు మహేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు వెల్మ నాగిరెడ్డి, గుంట రవి, పెద్ది శంకర్, సురేశ్, నాయకులు మాచర్ల వినయ్, నలుమాచు రామకృష్ణ, గన్ను శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు స్వామి రెడ్డి, మామిడి రాజేశం, సీపెల్లి గంగయ్య, మహేశుని మల్లేశం, దండె కృష్ణ, కొత్తూరు నరేశ్, కొత్తూరు రాజేందర్, జహీర్, గోపు శ్రీనివాస్‌రెడ్డి, సదాశివరెడ్డి, రావణ్, మహేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాబ్లీ కేసులో కోర్టుకు హాజరైన ఎమ్మెల్యేలు

బిలోలి సెషన్ కోర్టుకు హాజరైన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, ఏప్రిల్ 16: బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బిలోలి సెషన్ కోర్టుకు ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, ప్రకాశ్ గౌడ్, చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంత రైతుల భూములు ఎడారిగా మారుతుంటే చూస్తూ ఉండలేక ఆనాడు బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేశామని గుర్తు చేశారు. ఆ సమయంలో నమోదైన కేసులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు

శ్రీనివాస్‌కు స్వీటు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్16: పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసేవారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, అలాంటి వారిలో బీఆర్ఎస్ హుజురాబాద్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ ముందువరుసలో ఉంటారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు, హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలు హుజూరాబాద్‌లో, కరీంనగర్‌లోని వినోద్‌కుమార్ నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌తో కేక్ కట్ చేయించిన వినోద్‌కుమార్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సింగాపూర్ కిట్స్ గెస్ట్ హౌస్ వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావును శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలువగా, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయా వేడుకల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గంది రాధికాశ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, ఎంపీపీ ఇరుమల్ల రాణీసురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీల వార్షికోత్సవం

వేడుకల్లో భాగంగా రోజు వారీ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గన్నేరువరం, ఏప్రిల్ 16: మండలంలోని హన్మాజిపల్లి, గన్నేరువరం అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో పిల్లల నైపుణ్యాన్ని తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లల ఎత్తు, బరువును చూసి ఆరోగ్యాన్ని అంచనా వేయడంతోపాటు, రోజు వారీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇస్రత్ సుల్తాన, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్త, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

11మంది బైండోవర్

గన్నేరువరం, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మాదాపూర్, గునుకుల కొండాపూర్ గ్రామాలకు చెందిన బెల్ట్ షాప్ నిర్వాహకులు 11మందిని మంగళవారం తహసీల్దార్ భిక్షపతి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సీడ్ ప్లాంట్ ఎదుట బీహార్ కూలీల ధర్నా

మొలంగూర్ కావేరీ సీడ్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న బీహార్ కూలీలు

శంకరపట్నం, ఏప్రిల్ 16: మొలంగూర్ శివారులోని కావేరీ సీడ్ ప్లాంట్ ఎదుట మంగళవారం బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు ధర్నా చేశారు. సీడ్ ప్లాంట్ యాజమాన్యం తమకు చాలా కాలంగా కూలి రేట్లు పెంచడం లేదని వాపోయారు. తమకు కూలి రేట్లు పెంచే వరకు విధులు బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు పిట్టల సమ్మయ్యతో పాటు దాదాపు వంద మంది కూలీలు ధర్నాలో పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

మాట్లాడుతున్న కిట్స్ డైరెక్టర్ శంకర్

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్16: సైన్స్, టెక్నాలజీ రంగాల్లో రోజురోజుకూ అనేక మార్పులు వస్తున్నాయని, ఇంజినీరింగ్ విద్యార్థులు వాటిని గమనిస్తు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ విద్యార్థులకు సూచించారు. సింగాపూర్‌లోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కిట్స్ సైబర్ అసోసియేషన్, బ్రెయిన్ ఓ విజన్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో 'మొబైల్ ఇంటర్ ఫేస్ టెక్నాలజీ' అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో భాగంగా మంగళవారం రెండో రోజు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే సమయం, సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఎంచుకున్న రంగంపై పట్టుసాధించాలని సూచించారు. మొబైల్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య సూచించారు. కార్యక్రమంలో సీఏసీ విభాగ అధిపతి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ కే రవీంద్రబాబు, బెనో విజన్ సొల్యూషన్స్, ఇండియా శిక్షకురాలు యశస్విని సురభి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్స్ పవన్, రఘు, భాస్కర్ ప్రకాశ్, రఘుపతి, ప్రవీణ్, సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఆలయ ఆవరణలో శ్రీ సీతారాముల కల్యాణానికి వేసిన పందిళ్లు

ఇల్లందకుంట, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 17న జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో కందుల సుధాకర్ మంగళవారం తెలిపారు. భక్తులకు నీటి వసతి, బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జమ్మికుంట కాటన్ మిల్లర్లు, పారాబాయిల్డ్ రైస్ మిల్లర్స్ సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణానికి కలెక్టర్ పమేలా సత్పతి తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించనున్నారని ఈవో తెలిపారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

కార్పొరేషన్, ఏప్రిల్ 16: బల్దియా సిబ్బంది నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సూచించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం పలు సెక్షన్ల ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఆస్తిపన్నుల వసూలు, పెండింగ్ ట్రేడ్ లైసెన్స్‌లు, పెండింగ్ కోర్టు కేసులు, ఆస్తి పన్నుపై 5శాతం రిబెట్, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో నిర్ణీత సమయం ప్రకారం ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్తిపన్నుపై ప్రభుత్వం కల్పించిన 5శాతం రిబెట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. నగరంలో వ్యాపారం చేసే షాపుల యజమానుల నుంచి ట్రేడ్ లైసెన్స్ కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేసి ట్రేడ్ లైసెన్స్ జారీ చేయాలన్నారు. ప్రధాన రహదారులతో పాటు డివిజన్లలో రోడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టాలని.. ప్లాస్టిక్ వాడే షాపుల్లో తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ స్వరూపారాణి, ఈఈలు యాదగిరి, మహేందర్, డీసీపీ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో అన్నదానం

అంధుల పాఠశాలలో లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యానగర్, ఏప్రిల్ 16: గోల్డెన్ శాతవాహన లయన్స్ క్లబ్ సెక్రటరీ మానవాడ శంకర్ కూతురు శ్రీవిద్య జన్మదినం సందర్భంగా అంధుల పాఠశాలలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అక్కెనపల్లి అజయ్, కార్యదర్శి మానువాడ శంకర్, కోశాధికారి నన్నువాళ్ల గిరిధర్‌రావు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి రాములు, మార్కెటింగ్ కోఆర్డినేటర్ పాశం నరసింహారెడ్డి, సభ్యులు మాన్వాడ వనజ, గోని చంద్రారెడ్డి, మాచర్ల కిశోర్ గౌడ్, శాతవాహన కాలనీ అధ్యక్షుడు కస్తూరి మదన్‌మోహన్, లయన్స్ క్లబ్ సెకండ్ ప్రెసిడెంట్ గంగాడి ప్రకాశ్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

విద్యుత్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

ముకరంపుర, ఏప్రిల్ 16: క్షేత్ర స్థాయిలో పనిచేసే విద్యుత్ సిబ్బంది అన్ని అంశాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉంటే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో మంగళవారం క్షేత్ర స్థాయిలో పనిచేసే జేఎల్ఎం నుంచి ఫోర్‌మెన్ క్యాడర్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి అన్ని అంశాలపై అవగాహన కల్పించారు. వినియోగాదారులకు నిరంతరం నాణ్యమైన సరఫరా అందించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బందితో భద్రత నిబంధనల ప్రతిజ్ఞ చేయించారు. పలు అంశాలపై సిబ్బందికి శిక్షణ నిచ్చిన మాస్టర్ ట్రైనర్లు మల్లేశం, పురుషోత్తం, సత్యనారాయణ, సంపత్ రావు, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌ను అభినందించారు. ఎస్ఈ వడ్ల కొండ గంగాధర్ ప్రారంభించిన కార్యక్రమంలో డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, చంద్రమౌళి, లక్ష్మీరెడ్డి, కాళిదాసు, ఏడీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహస్వామి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నర్సింహస్వామి కోరారు. యూనియన్ హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండల శాఖల సమావేశం మంగళవారం హుజూరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పోలంపెల్లి ఆదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2023లో జరిగిన స్కూల్ అసిస్టెంట్ బదిలీలల్లో ఇంకా చాలామంది ఉపాధ్యాయులు రిలీవ్ కాలేదని, వారిని ఈనెల 23లోగా రిలీవ్ చేయడంతోపాటు వారు బదిలీ అయిన పాఠశాలలో విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల తిరుపతి, మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద్దుటూరి కిషన్‌రెడ్డి, దేవోజు నాగరాజు, కర్ర గోపి, తోట వేణుగోపాల్, దానంపల్లి శ్రీనివాస్, పత్తెం శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, జయశ్రీ, సీనియర్ నాయకుడు డీ సుధాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్16: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ సూచించారు. గంజాయి సేవించడం, విక్రయించడం లాంటివి చేస్తున్నారన్న సమాచారం మేరకు హుజూరాబాద్ సబ్ డివిజన్‌లోని ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 24 మందికి మంగళవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వారితో మత్తుపదార్థాల జోలికి పోమని ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. అనంతరం 24 మందిని హుజూరాబాద్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్, ఎస్ఐ సాంబయ్యగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై డీపీవో విచారణ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 16: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 473, 474లో 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టారనే ఫిర్యాదు మేరకు డీపీవో రవీందర్ మంగళవారం విచారణ చేశారు. గ్రామ పంచాయతీలో సంబంధిత భూ రికార్డులను పరిశీలించారు. పూర్తి రికార్డులతో కరీంనగర్‌కు రావాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పీ మల్లయ్య, జూబ్లీనగర్ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, కారోబార్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు ఆదర్శనీయం

మాట్లాడుతున్న వీసీ మల్లేశ్ సంకశాల

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 16 : మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, కొమ్రం భీం, చాకలి ఐలమ్మ లాంటి మహనీయుల జీవితాలు ఆదర్శనీయమని ఎస్‌యూ వీసీ ఆచార్య మల్లేశ్ సంకశాల కొనియాడారు. మంగళవారం విశ్వవిద్యాలయ లైబ్రరీ ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, కొమ్రం భీం, చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య మల్లేశ్ సంకశాల హాజరై మాట్లాడుతూ, మహనీయుల ఆలోచనా విధానాలను మన జీవితానికి అన్వయించుకొని సమాజంలోని అసమానతలను నిర్మూలించాలన్నారు. సభా అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ, దేశమంతా మహనీయుల జయంతులను జరుపుకోవాలని, వారి సేవలను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అడప సత్యనారాయణ, ఆచార్య గోన నాయక్, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కే పద్మావతి, జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ మనోహర్, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం సరసిజ, ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే తిరుపతి, డీ విజయ ప్రకాశ్, డీ విజయ్ కుమార్, శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్16: ఈ నెల 20న హుజూరాబాద్‌లోని సాయిరూప ఫంక్షన్ హాల్‌లో జరుగనున్న కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సంయుక్త సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం హుజూరాబాద్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కార్యాలయంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం, రాష్ట్ర నాయకుడు మారేపల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్, ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ మండలాధ్యక్షుడు బొరగాల రాజ్‌కుమార్, నాయకులు మొలుగూరి ప్రభాకర్, కలవల మల్లయ్య, తెలంగాణ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఊటూర్ సొసైటీలో విచారణ

లక్ష్మీపూర్‌లోని సొసైటీలో విచారణ చేపట్టిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, సంఘం అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 16: మండలంలోని ఊటూర్ సొసైటీ (లక్ష్మీపూర్)లో అవినీతి అక్రమాలు జరిగాయని ఇటీవల పలువురు పాలకవర్గ సభ్యులు, డీసీవోకు ఫిర్యాదు చేసిన క్రమంలో మంగళవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు విచారణ చేపట్టారు. మొదటగా ఫిర్యాదు చేసిన పాలక వర్గ సభ్యుల నుంచి వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకోగా, అనంతరం సంఘం అధ్యక్షుడు ముద్దసాని ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎడ్ల సతీశ్ కుమార్‌తో పాటు మరికొంత మంది పాలకవర్గ సభ్యుల నుంచి సమాచారాన్ని సేకరించారు. పాలక వర్గ సభ్యులు చేసిన ఆరోపణలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేనందున వివరణ ఇచ్చేందుకు కనీసం 10 రోజుల గడువు ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు అసిస్టె